క్లుప్తంగా

నలుగురు జూదరులు అరెస్టు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివార్లలోని ఓ పెట్రోల్ బంకు సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి 4600 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్సై కోటేశ్వరరావు శనివారం రాత్రి విలేకరులకు తెలిపారు. పేకాట ఆడినా, అక్రమంగా మద్యాన్ని అమ్మినా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని మూగచింతల, కొండాయపాలెం, సలకనూతల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శనివారం తహసీల్దార్ సీహెచ్ అశోక్‌కుమార్‌రెడ్డి, ఎస్సై వెంకట సైదులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు తెలపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో కిటికీలు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, ర్యాంపులు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.సుబ్బారావు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

బేస్తవారిపేట: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ బి.నాగమణి తెలిపారు. ఈ నెల 27వ తేదీలోపు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో పూర్తి చేసిన దరఖాస్తులను అందజేయాలని కోరారు. మండలంలోని జేబీకే పురం ఓసీ అంగన్‌వాడీ కార్యకర్త, కంభం మండలం లింగోజీపల్లె ఓసీ ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు సచివాలయంలో నోటిఫికేషన్ అంటించనున్నట్లు పేర్కొన్నారు.

సామాజిక తనిఖీ సక్రమంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి

యర్రగొండపాలెం: ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ సక్రమంగా నిర్వహించాలని డ్వామా జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులు, పంచాయతీరాజ్ శాఖ, ఫారెస్ట్, గ్రామీణ నీటిపారుదల శాఖ, నాడు-నేడు పనులకు త్వరలో సామాజిక తనిఖీ జరుగుతుందని చెప్పారు. ఆడిట్ సిబ్బందికి సంబంధిత అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సహకారం అందించి ఆడిట్ సక్రమంగా జరిగే విధంగా చూడాలన్నారు. తప్పులు జరిగినట్లు రుజువు అయితే నిబంధనలకు లోబడి చర్యలు తీసుకుంటారని ఆమె హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అదనపు విజిలెన్స్ అధికారి వెంకటస్వామి, ఎంపీడీవో వైవీ నాగేశ్వర ప్రసాద్, ఎస్ఆర్‌పీ సుబ్బారావు, ఏపీవోలు శైలజ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాజంపల్లిలో వన మహోత్సవం



కలుపు తీస్తున్న విద్యార్థులు

దర్శి: జాతీయ సేవా పథకం వన మహోత్సవం కార్యక్రమం రాజంపల్లిలో శనివారం ఘనంగా నిర్వహించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. వేప, చింత, కానుగ వంటి అడవి మొక్కలు నాటారు. గ్రామ పరిసరాల్లో ఉన్న వయ్యారి భామ కలుపు మొక్కలను నిర్మూలించారు. బాపట్ల కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ పంటలు వేసుకునే ముందు భూసార పరీక్షలు చేయించి శాస్త్రవేత్తలు చెప్పిన విధంగా పంటలు వేసుకుంటే మంచి దిగుబడులు వస్తాయని చెప్పారు. రైతులు అనుమానాలు, సందేహాలు నివృత్తి చేశారు.

స్వచ్ఛ గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం



ఏలూరు సభలో పాల్గొన్న ఎంపీడీఓ పి.శ్రీకృష్ణ

పొదిలి రూరల్: దేశంలోని ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా మార్చాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో పి.శ్రీకృష్ణ పేర్కొన్నారు. శనివారం పొదిలి మండలంలోని ఉప్పలపాడు, ఏలూరు పంచాయతీల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ చిత్రాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రధానిమంత్రి నరేంద్ర మోదీ సందేశాన్ని వినిపించి, ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ కృష్ణ, సర్పంచ్ సింగయ్య, ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేనూ మీలో ఒకడినే..
మనస్ఫూర్తిగా ఆదరించండి!

- వైఎస్సార్ సీపీ వై.పాలెం ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న తాటిపర్తి చంద్రశేఖర్

పెద్దదోర్నాల: తానూ మీలో ఒకడినేనని, తనను మనస్ఫూర్తిగా ఆదరించాలని వై.పాలెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని శివసదనం అతిథి గృహంలో వైఎస్సార్ సీపీ మండల కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల పార్టీ అధ్యక్షుడు గంటా వెంకట రమణారెడ్డి సమావేశానికి అధ్యక్షత వహించారు. కార్యకర్తలను ఉద్దేశించి చంద్రశేఖర్ మాట్లాడుతూ యర్రగొండపాలెం నియోజకవర్గానికి తలపై ఉన్న గంగమ్మను గుర్తించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ గంగమ్మను వెలుగొండ ప్రాజెక్టు రూపంలో తెచ్చిపెట్టారని కొనియాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి సారథ్యంలో నేడు ప్రాజెక్టు పనులు దాదాపు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధమైందన్నారు. ప్రాజెక్టు పూర్తయితే లక్షల మందికి తాగునీరు, వేల ఎకరాలకు సాగు నీరు అందనుందన్నారు. రాష్ట్రంలో గతంలో 34 లక్షల మందికి పెన్షన్లు ఉంటే ప్రస్తుతం 68 లక్షల మందికి పెన్షన్లు అందుతున్నాయని వివరించారు. బాబొస్తే జాబు వస్తుందన్న నినాదంతో అధికారం లోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వంలో కేవలం 35 వేల మందికి మాత్రమే ఉద్యోగాలు కల్పించారని పేర్కొన్నారు. జగన్ అధికారంలోకి రావటంతోనే ఒక్క సచివాలయ వ్యవస్థలోనే 2 లక్షల 65 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చారని కొనియాడారు. దీంతో పాటు లక్షల మంది నిరుద్యోగులకు వలంటీర్లుగా నియమించి నెలకు 5 వేల రూపాయలు అందిస్తున్న ఘనత జగనన్నదేనన్నారు.



ర్యాలీకి భారీగా హాజరైన కార్యకర్తలు

పోటెత్తిన జన సందోహంతో భారీ ర్యాలీ

మండల కేంద్రానికి తొలిసారిగా విచ్చేసిన నియోజకవర్గ నూతన సమన్వయకర్త తాటిపర్తి చంద్రశేఖర్‌కు నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. గ్రామ శివార్లలో ఉన్న మార్కెట్ యార్డు నుంచి మండల కేంద్రంలోని నటరాజ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బొల్లావుల నృత్యంతో పాటు టపాసుల మోతలతో కార్యకర్తల హర్షధ్వానాల నడుమ ర్యాలీ నిర్వహించారు. నటరాజ్ సెంటర్‌లోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శివసదనంలో జరిగిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరయ్యారు. కార్యకర్తలకు భారీ విందు ఏర్పాటు చేశారు. ఎంపీపీ గుమ్మా పద్మజ, సర్పంచ్ చిత్తూరి హారిక, మాజీ జెడ్పీటీసీ సభ్యులు అమిరెడ్డి రామిరెడ్డి, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ మజీద్, మాజీ ఎంపీపీలు ధర్మానాయక్, జోగి వెంకట నారాయణ, త్రిపురాంతకం మండల పార్టీ అధ్యక్షుడు సింగారెడ్డి పోలిరెడ్డి, అల్ల ఆంజనేయరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య, వ్యవసాయ పరపతి సంఘ అధ్యక్షుడు వెన్నా కాశిరెడ్డి, ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ దుగ్గెంపూడి వెంకటరెడ్డి, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ దూదేకుల ఖాశింపీరా, జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రటరీ గుమ్మా యల్లేష్, మైనారిటీ సెల్ జనరల్ సెక్రటరీగా దూదేకుల రసూల్, మహిళా విభాగం సెక్రటరీ రోసిమేరీ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు యక్కంటి వెంకటేశ్వరరెడ్డితో పాటు మండలానికి చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు. ఏఎంసీ డైరెక్టర్‌లు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు.

ప్రశాంతంగా జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష



మార్కాపురంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాజేష్‌కుమార్



పరీక్ష పేపర్లు విడుదల చేస్తున్న చీఫ్ సూపరింటెండెంట్లు

మార్కాపురం: జవహర్ నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. మార్కాపురం పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 336 మందికిగాను 180 మంది, జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 204 మంది, రాయవరం గురుకుల పాఠశాలలో 223 మంది, వివేకానంద విద్యాపీఠంలో 204 మంది హారజయ్యారు. మొత్తం 1344 మంది విద్యార్థులకుగాను 811 మంది హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్, జెడ్పీ బాలుర హెచ్ఎం మునగాల చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాలను డిప్యూటీ డీఈఓ చంద్రమౌళి, ఎంఈఓ రాందాస్‌నాయక్, జవహర్ నవోదయ ప్రిన్సిపాల్‌తోపాటు అబ్జర్వర్ స్వాతి పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గిద్దలూరు రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నవోదయ విద్యాలయంలో ప్రవేశం కోసం 6వ తరగతికి చెందిన విద్యార్థులకు శనివారం ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 288 విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 73 మంది గైర్హాజరయ్యారు. పరీక్షను ప్రధానోపాధ్యాయుడు నాగభూషణ్‌రెడ్డి, అబ్జర్వర్ ఎం.రామసుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు.

కంభం: నవోదయ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 204 మందిని కేటాయించగా 83 మంది విద్యార్థులు హాజరుకాగా 121 మంది గైర్హాజరయ్యారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 240 మంది విద్యార్థులను కేటాయించగా 184 మంది హాజరై 56 మంది గైర్హాజరయ్యారు.

పొదిలి రూరల్: పొదిలి పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ఆల్ఫా రెసిడెన్షియల్ పాఠశాలలో శనివారం నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా సాగింది. మూడు కేంద్రాలకు దాదాపు 845 మంది విద్యార్థులను కేటాయించగా 428 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఎంఈఓలు ఎం.శ్రీనివాసరెడ్డి, నాగలక్ష్మి పర్యవేక్షించారు.

దొనకొండ జెడ్పీలో నవోదయ ఎంట్రన్స్ పరీక్ష

దొనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నవోదయ ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహించారు. దొనకొండ, కురిచేడు, తర్లుపాడు మండలాలకు చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు 264 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షకు 174 మంది హాజరయ్యారు. 90 మంది గైర్హాజరైనట్లు ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు తెలిపారు. పరీక్షల చీఫ్ రాజేష్‌కుమార్ పర్యవేక్షణలో పరీక్ష జరిగింది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యార్థులు పరీక్ష ప్రశాంతంగా రాసుకున్నారు.

పారదర్శకంగా కులగణన



మార్కాపురం జగదీశ్వరి థియేటర్ ప్రాంతంలో సర్వే చేస్తున్న సిబ్బంది



నాయుడుపేటలో కులగణన సర్వే..



ఏలూరులో సర్వేను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ, ఈవోఆర్డీ

మార్కాపురం: మార్కాపురం పట్టణంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం కులగణన కార్యక్రమం కొనసాగింది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేస్తున్నారు. సర్వేను మున్సిపాలిటీలో కమిషనర్ రవీంద్ర, గ్రామాల్లో ఎంపీడీఓ చందన పర్యవేక్షించారు. సర్వే సిబ్బందికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

■ **కొనకనమిట్ల:** మండలంలోని గొట్లగట్టు, నాయుడుపేట ఎస్సీ కాలనీల్లో నిర్వహిస్తున్న కులగణన సర్వే తీరును ఎంపీడీఓ అద్దంకి శ్రీనివాసమూర్తి పరిశీలించారు. సర్వేలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా సక్రమంగా చేయాలని సర్వే సిబ్బందికి తెలిపారు. సర్వే చేస్తున్న టీమ్‌కు ప్రజలు సహకరించాలని కోరారు.

■ **పొదిలి రూరల్:** ప్రజల సామాజిక స్థితిగతులు తెలుసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మరో చరిత్రాత్మక కార్యక్రమం కుల గణన సర్వే అని ఎంపీడీఓ పి.శ్రీకృష్ణ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పొదిలి మండలంలోని ఏలూరు పంచాయతీలో కుల గణన సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి శేషగిరి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వెలుగొండ ఆలయానికి పోటెత్తిన భక్తులు



శ్రీవారి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొనకనమిట్ల: పుష్య మాసం శనివారం సందర్భంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగ సమేత వెంకటేశ్వరస్వామి మూలవిరాట్‌ను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మార్కాపురానికి చెందిన జవ్వాజి వెలుగొండయ్య సహకారంతో భక్తులకు అన్నదానం చేసినట్లు కమిటీ సభ్యులు జగన్, రత్నంశెట్టి, జి.లక్ష్మీనారాయణ తెలిపారు.

ఐదు కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు



కంది పంటను పరిశీలిస్తున్న ఏఓ

దొనకొండ: గ్రామాల్లో రైతులు పండించిన కంది పంటను మద్దతు ధరకు అమ్ముకునేందుకు ప్రభుత్వం మండలంలోని ఆరవల్లిపాడు, వద్దిపాడు, ఇండ్లచెరువు, మంగినపూడి, పోలేపల్లి గ్రామాల్లో కందుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ ఏడాది మండలంలో సుమారు 4 వేల ఎకరాలు కంది పంట సాగు చేశారని, 1600 మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చని వ్యవసాయ శాఖ అంచనా వేసినట్లు ఆయన వివరించారు. బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరలకే కందులను కొనుగోలు చేస్తామన్నారు. అనంతరం ఆరవల్లిపాడులో రైతులు సాగు చేసిన కంది పంటను ఏఓ పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నాగులుప్పలపాడు: మనం-మన ఊరు-మన ఈదుమూడి ఆధ్వర్యంలో నేడు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కావూరి వాసు తెలియజేశారు. ఒంగోలు శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరంలో సాధారణ వ్యాధులతో పాటు చిన్న పిల్లలు, ఎముకలు కీళ్ల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన ఆడుదాం ఆంధ్రా పోటీలు



క్రీడాకారులకు కిట్‌లు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



క్రికెట్ విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

కంభం: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు విజయవంతంగా ముగిసాయని ఎంపీపీ వెంకట్రావు అన్నారు. శనివారం జరిగిన ఫైనల్ పోటీల్లో ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్‌లో మోహిద్దీన్‌పురం జట్టు, వాలీబాల్‌లో అర్థవీడు, క్రికెట్‌లో పాపినేనిపల్లి జట్టు విజయం సాధించాయి. విజేతలకు నియోజకవర్గ స్థాయిలో పాల్గొనేందుకు కిట్‌లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి, తహసీల్దార్ అత్తార్ నాయబ్ హుస్సేన్, ఎంఈఓ లక్ష్మీనాయక్, సర్పంచ్‌లు వసంతమ్మ, అచ్చమ్మ, నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేత

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని బొద్దికూరపాడులో రాజారెడ్డి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. పోటీల్లో గెలుపొందిన రాజారెడ్డి లెవెన్స్ టీంకు మొదటి విజేతకు జట్టుకు రూ.15 వేలను ఉప సర్పంచ్ పులి ప్రసాదరెడ్డి స్పాన్సర్ చేయగా అందజేశారు. ద్వితీయ బహుమతిని రూ.పది వేలను గంగవరపు శివారెడ్డి సమకూర్చగా ద్వితీయ విజేత జట్టు వెలుగువారిపాలెం జట్టుకు, తృతీయ విజేత జట్టుకు భోగసముద్రం గోపాలరెడ్డి సమకూర్చిన రూ.ఐదు వేలను అయ్యప్పరాజుపాలెం టీంకు అందజేశారు. మ్యాన్ ఆఫ్‌ది సిరీస్‌గా నిలిచిన క్రీడాకారుడు చిన్నపురెడ్డి ఫణీంద్రరెడ్డికి కొప్పుల కళ్యాణి, పులి శ్రీనివాసులరెడ్డిలు రెండు వేలను సమకూర్చగా అందజేశారు. క్రికెట్ పోటీలు సజావుగా సాగేందుకు సహకరించిన గ్రామస్తులకు, క్రీడాకారులకు పులి ప్రసాదరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. పులి ప్రభాకరరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా సంకీర్తన పారాయణం



ప్రత్యేక అలంకారంలో హనుమాన్ విగ్రహం



పూజల్లో పాల్గొన్న భక్తులు

మార్కాపురం టౌన్: అయోధ్య బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో తొలిరోజు శనివారం అఖండ హనుమాన్ చాలీసా సంకీర్తన పారాయణం నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు ప్రసాద వితరణ చేశారు. వికాస తరంగిణి మహిళా కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి ఆలయ అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ జి.శ్రీనివాసరెడ్డి, ఆలయ సిబ్బంది, భక్తులు పర్యవేక్షించారు.


పోతలపాడులో బుక్ డిపాజిట్ సెంటర్ ప్రారంభం



బుక్ డిపాజిట్ సెంటర్ ప్రారంభిస్తున్న సర్పంచ్, ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సుబ్బారెడ్డి

తర్లుపాడు: మండలంలోని పోతలపాడులో శనివారం మార్కాపురం శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బుక్ డిపాజిట్ సెంటరును స్థానిక సర్పంచ్ శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు డీవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. విద్యార్థులు, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని విజ్ఞానాన్ని పొందాలని సూచించారు. రైతులకు అవసరమైన పుస్తకాలు కూడా అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మార్కాపురం గ్రంథపాలకులు జీవీ శివారెడ్డి, పంచాయతీరాజ్ జిల్లా సెక్రటరీ గాయం వెంకటేశ్వరరెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణతో తెగుళ్ల నివారణ



రాజుపాలెంలో మిర్చిపంటలను పరిశీలిస్తున్న రవీంద్రరెడ్డి, అన్నపూర్ణమ్మ, మోహన్‌రెడ్డి

కొత్తపట్నం: మిరపలో వచ్చే ఆకుముడత, నల్లతామర పురుగును నివారించేందుకు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని వ్యవసాయ సలహా మండలి బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి అన్నారు. మండలంలోని రాజుపాలెం, గమ్మళ్లపాలెం గ్రామాల్లో మిర్చి పంటల సాగుచేస్తున్న పైరును ఏటీఎంఏ అన్నపూర్ణమ్మ, రవీంద్రరెడ్డి, ఉద్యానవనశాఖాధికారి తేజ, ఏఓ మోహన్‌రెడ్డి శనివారం పరిశీలించారు. మిర్చి సాగు చేస్తున్న రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా రవీంద్రరెడ్డి మాట్లాడుతూ సమగ్ర సస్యరక్షణ చర్యలతో మిరపలో ఆకుముడత, నల్లతామర వల్ల జరిగే నష్టాన్ని నివారించవచ్చన్నారు. అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ తెల్లదోమను గుర్తించి అరికట్టడానికి ఎకరానికి 20 నుంచి 25 వరకు పసుపురంగు జిగురు అట్టలు పెట్టుకోవాలన్నారు. నల్ల తామర పురుగులను గుర్తించి అరికట్టడానికి ఎకరాకు 20-25 వరకు బులుగు రంగు జిగురు అట్టలు పెట్టుకోవాలని సూచించారు. మిరప పంట చుట్టూ కంచె పంటగా జొన్న గానీ మొక్కజొన్న గానీ 2,3 వరుసల్లో వేసుకుంటే దోమ లేక పురుగు వ్యాప్తి చెందకుండా నివారించవచ్చన్నారు. నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను అవసరమైన మోతాదులో వేసుకోవాలన్నారు. వీఏఏలు మృదులత, రైతులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఇన్‌చార్జి తహశీల్దార్, ఎస్ఐ, ఎంఈఓ ఇతర సిబ్బంది

మద్దిపాడు: మండలంలోని నేలటూరు పెదకొత్తపల్లి గ్రామాలకు చెందిన పోలింగ్ బూత్‌లను ఇన్‌చార్జి తహశీల్దార్ ఆశాజ్యోతి, ఎస్ఐ శ్రీకాంత్, ఎంఈఓఎం శ్రీనివాసరావులు నేలటూరు, పెదకొత్తపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లలో సౌకర్యాలను పరిశీలించారు. బూత్‌లు పోలింగ్ చేసుకోవడానికి అనువుగా ఉందీ లేనిది, ర్యాంపుల ఏర్పాటు, వారు పూర్తి స్థాయిలో పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. పోలింగ్ సమయంలో గ్రామంలో ఏదైనా గొడవలు జరిగే అవకాశాలు ఉన్నాయా అంటూ గ్రామస్తులను విచారించారు. కార్యక్రమంలో వారి వెంట రెవెన్యూ సిబ్బంది సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలోని ఆలయాల శుద్ధి



ఆలయాలను శుద్ధి చేస్తున్న మహిళలు

ఒంగోలు మెట్రో: అయోధ్యలో శ్రీరామచంద్రుడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఒంగోలు నగరంలోని గాంధీనగర్లో మహిళలు రామలింగేశ్వర స్వామి ఆలయ పరిసరాలను శుభ్రం చేసి స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ పవిత్రమైన అయోధ్యలో శ్రీరామ చంద్రుని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా స్వచ్ఛ తీర్థ్ కార్యక్రమాన్ని మకర సంక్రాంతి రోజు నుంచి 22వ తేదీ సోమవారం వరకు దేశంలోని అన్ని దేవాలయాల్లో పెద్ద ఎత్తున పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఇంట్లో, ప్రతి దేవాలయంలో ఐదు దీపాలు వెలిగించి శ్రీరామ నామ జపం చేయాలని మహిళలు పేర్కొన్నారు.

రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి



మాట్లాడుతున్న అబ్దుల్ సుబాన్

మార్కాపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, అనుబంధ పార్టీలను ఓడించాలని, మేలుకో ఆంధ్రప్రదేశ్ టీమ్ సభ్యులు కేఎం అబ్దుల్ సుబాన్, రమేష్ పట్నాయక్ అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. 2014 నుంచి అధికారంలో ఉన్న బీజేపీ ప్రజా వ్యతిరేక బిల్లులను అమలు చేస్తోందని విమర్శించారు. మణిపూర్‌లో హింసను ఆపాలని కోరారు. దేశవ్యాప్తంగా దళిత, మైనార్టీ, లౌకిక ప్రజాస్వామ్యవాదులను తుదముట్టించే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీజే రాష్ట్రప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ రజాక్, ఐజేయూ నాయకులు ఎస్వీ రమణ, ముస్లిం లీగ్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఇస్మాయిల్, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్, కాంగ్రెస్ మహిళా నేత షేక్ రెహానా పాల్గొన్నారు.